# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## సిలిండర్ కర్మాగారంలో అగ్ని ప్రమాదం



రేణిగుంట, మే 27 ప్రభాతవార్త: రేణిగుంట పారిశ్రామిక వాడలో ఓ సిలిండర్ కర్మాగారంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. కర్మాగారంలో ఉన్నట్లుండి అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు ఊవెత్తున ఎగిసిపడడంతో ఆ ప్రాంతంలోని కార్మికులు భయంతో పరుగులు తీశారు. సిలిండర్లకు వేసే రెడ్యాక్సైడ్ పెయింట్, ఎన్సీ థిన్నర్ నిల్వ ఉండడం వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలం చేరుకుని మంటలను అదుపు చేశారు.

## ఎలక్షన్ కమిషన్ సీరియస్

### పోలింగ్ విధులకు గైర్హాజరైన 65 మందిపై వేటు

చిత్తూరు, మే 27 ప్రభాతవార్త: ఎన్నికల పోలింగ్ విధులకు గైర్హాజరైన 65 మంది అధికారులు, సిబ్బందిపై ఎలక్షన్ కమీషన్ సీరియస్ అయ్యింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్ ఎన్నికల పోలింగ్ విధులకు గైర్హాజరైన 65 మంది అధికారులు, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులకు గైర్హాజరైన 228 మంది ఉద్యోగులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో కొంతమంది ఇతర ఎన్నికల విధుల్లో పాల్గొన్నట్లు, మరికొంతమంది రాత పూర్వకంగా సంజాయిషీ ఇచ్చారు. సంతృప్తికరంగా సమాధానం ఇవ్వని 65 మంది ఉద్యోగులపై సోమవారం కలెక్టర్ సగలి షన్మోహన్ సస్పెన్షన్ వేటు వేశారు.

# కాయ్.. రాజా.. కాయ్..

## -ఎన్నికల ఫలితాలపై భారీగా బెట్టింగులు??



కుప్పం, మే 27 ప్రభాతవార్త ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఫలితాలకోసం ఉత్కంఠతకు లోనవుతుంటే మరోవైపు ఎన్నికల ఫలితాలపై భారీగా బెట్టింగ్ రాయుళ్ల పందేలు కాసేందుకు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు సరిగ్గా మరో వారం రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఫలాన పార్టీ గెలుస్తుందని, ఫలాన పార్టీ అధికారంలో వస్తుందని జోరుగా బెట్టింగ్‌లు కాస్తున్నట్లు సమాచారం. వేలల్లో నుంచి లక్షల్లో దాకా ఈ బెట్టింగ్‌లు జరుగుతున్నాయని తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, చిత్తూరు పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో అటు వైకాపా, ఇటు తెదేపా అత్యధిక స్థానాలు దక్కించుకుంటాయని బెట్టింగ్ రాయుళ్లు, రాజకీయ పక్షాల నేతలు ఆయా పార్టీల తరపున పందేలకు సిద్ధమైనట్లు సమాచారం. రాష్ట్రంలోనే హాట్ టాఫిక్ నియోజకవర్గాల్లో ఒకటైన కుప్పం నుంచి తెదేపా అధినేత చంద్రబాబునాయుడు పోటీ చేశారు. ఈసారి కుప్పంలో చంద్రబాబుకు ఎంత మెజార్టీ వస్తుందోననే అంశంగా జిల్లాలోనే కాక రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో సైతం భారీగా బెట్టింగులు కట్టినట్లు సమాచారం. కుప్పం ఫలితంపై అన్ని వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారనడంలో సందేహం లేదు.మరో పక్క కుప్పంలో వైఎస్సార్సీ సైతం గెలుస్తుందని భారీగానే వైకాపా శ్రేణులు పందేలు కాసినట్లు తెలిసింది. ఇక జిల్లాలోని పుంగనూరులో సైతం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వచ్చే మెజార్టీపై బెట్టింగులు కట్టినట్లు తెలిసింది. చిత్తూరు, పలమనేరు, జిడి నెల్లూరు (ఎస్సీ), పూతలపట్టు (ఎస్సీ) నియోజకవర్గాలకు సంబంధించి వైకాపా, తెదేపా అభ్యర్థుల గెలుపు, మెజార్టీలపై సైతం భారీగానే బెట్టింగ్‌లకు ఆయా పార్టీల నేతలు సిద్ధమైనట్లు తెలిసింది. నగరిలో మంత్రి రోజా గెలుపోటములపై సైతం భారీగా పందేలు కాస్తున్నట్లు సమాచారం. మరి ఈ బెట్టింగ్‌ల్లో ఎవరు లాభపడుతారో, ఎవరు నష్టపోతారో జూన్ 4వతేదిన వెలువడే ఎన్నికల ఫలితాలు తేల్చనున్నాయి.

# రక్తమోడిన రహదారి

### కారు కల్వర్టును ఢీకొట్టి నలుగురు మృతి

### మరో ఇద్దరికి తీవ్రగాయాలు.. ఒకరి పరిస్థితి విషమం





చంద్రగిరి, మే 27 ప్రభాతవార్త: హృదయవిదారకర దుర్ఘటనతో రక్తమోడిన రహదారి చూపరులను కంటతడి పెట్టించింది. సిఐ రామయ్య అందించిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి వద్ద సోమవారం వేకువజామున కారు కల్వర్టును ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. నెల్లూరు జిల్లా, ఇందుకూరు మండలం, నరసాపురం గ్రామానికి చెందిన శేషయ్య, తన భార్య జయంతి, శ్రీనివా సులు, తన భార్య నీరజ అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య చికిత్సల నిమిత్తం వేలూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో తమ సమీప బంధువు పద్మమ్మను వెంట తీసుకుని రాగా, డ్రైవర్ సమీర్ వీరిని తీసుకుని వేలూరుకు బయలుదేరాడు. సోమవారం వేకువజామున సుమారు 5.30-5.40 గంటల సమయంలో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు కల్వర్టులో చిక్కుకు పోయింది. సమాచారం అందుకున్న సిఐ రామయ్య, ఎస్ఐ అనిత తమ సిబ్బందితో ఇక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కల్వర్టులో చిక్కుకున్న కారును వెలికితీయడానికి పోలీసులు చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో సమీప టోల్‌గేట్ వద్ద నుండి క్రేన్‌ను తీసుకువచ్చి కారును వెలికితీశారు. అప్పటికే శేషయ్య, జయంతి, పద్మమ్మ, సమీర్ కారులోనే మృతి చెందారు. తీవ్రగాయాలతో విలవిలలాడుతున్న శ్రీనివాసులు, నీరజను వెలికితీసి తిరుపతి రుయాకు తరలించారు. కల్వర్టును కారు ఢీకొట్టిన వేగానికి ఇంజన్ సైతం విడిపోయిపడినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా హెడ్‌కానిస్టేబుల్స్ బాలకృష్ణ, నాగరాజు, కానిస్టేబుల్స్ దివాకర్ రావు, గోపి, హోమ్‌గార్డ్స్ భానుప్రతాప్, సుధాకర్, దిలీప్ అతికష్టంపై కారు డోర్లను గడ్డపార్లతో పెకళించి మృతదేహాలను వెలికితీశారు.

# పక్కాగా ఓట్ల లెక్కింపు

### వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ మీనన్

చిత్తూరు, మే 27 ప్రభాతవార్త: జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించి పూర్తి చేయడానికి అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలని భారత ఎన్నికల సంఘ ప్రధాన కమీషనర్ రాజీవ్ మీనన్ ఆదేశించారు. అలాగే ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో మాత్రం జాప్యం చేయకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటిస్తూ త్వరితంగా కచ్చితమైన ఫలితాలు ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికల జరిగిన రాష్ట్రాల సిఇఓలు, నియోజకవర్గాల ఆర్‌ఓలు, జిల్లా ఎన్నికల అధికారులతో ఎన్నికల కమీషనర్లు జ్ఞానేష్‌కుమార్, డాక్టర్ సుఖ్బీర్‌సింగ్‌లతో కలిసి ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ మీనన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడుతూ దేశంలో సార్వత్రిక ఎన్నికల అందరి సమిష్టి కృషితో విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే జూన్ 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపును సైతం విజయవంతంగా చేపట్టి పూర్తి చేయడానికి అన్ని విధాల ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఓట్లు లెక్కింపు రోజు ఇవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా వుండాలన్నారు. నిర్ణీత పాస్ లేకుండా ఎవరిని అనుమతించకూడదని స్పష్టం చేశారు. ఇవిఎంల్లో పోల్ అయిన ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యుటర్లు, స్కానర్లు, ప్రింటర్లు తదితరాలు ముందుగానే ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద వుంచుకోవాలన్నారు. కౌంటింగ్ రోజుల లెక్కించే ఇవిఎంలను ఎడాపెడా పడవేయకుండా ఒక క్రమపద్దతిలో తీసుకురావడం, ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఓట్ల లెక్కింపు పూర్తయినట్లు మార్కు వేసి ఆ ఇవిఎంకు సీల్ వేసి క్రమపద్ధతితో సురక్షితంగా భద్రపరచాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సచివాలయం నుండి కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఇతర అధికారులు హాజరయ్యారు.

# త్వరితగతిన ఖచ్ఛితమైన ఫలితాలను ప్రకటించాలి

### ఎలెక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్



తిరుచానూరు, మే 27 ప్రభాతవార్త: వచ్చే నెల జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని నిర్వాచన్ సదన్, న్యూ ఢిల్లీ నుంచి భారత చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ శ్రీ రాజీవ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏ మాత్రం జాప్యం చేయకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన కచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈవోలు, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లాల ఎన్నికల అధికారులతో ఎలెక్షన్ కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, డా. సుఖ్బీర్‌సింగ్ సంధ్‌తో కలసి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, డీఆర్వో పెంచల్ కిషోర్‌లతో కలసి హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భారత చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ మాట్లాడుతూ దశలవారీగా దేశ వ్యాప్తంగా జరుగుతున్నసార్వత్రిక ఎన్నికలను అందరి సమిష్టి కృషితో ఎంతో విజయవంతంగా జరుగుతుందని అదే స్ఫూర్తితో వచ్చే నెల 4వ తేదీ జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూముల వద్ద క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత పాస్ లేకుండా ఎవరిని అనుమతించవద్దన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పవర్ బ్యాకప్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

### సూర్య,చంద్రులపై అభయమిచ్చిన

# కల్యాణ వేంకటేశ్వరుడు

### నేడు కల్యాణ వెంకన్న రథోత్సవం





సూర్యప్రభ, చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

నారాయణవనం, మే 27 ప్రభాతవార్త : ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా వెలసిన నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి కల్యాణ వేంకటేశ్వరుడు ఏడవ రోజు సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 7గంటలకు కల్యాణ వేంకటేశ్వరున్ని చంద్రప్రభవాహనంపై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాండనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై అధిరోహించి మాడవీధి, మెయిన్‌రోడ్డు, కొత్తబజారువీధి, పాత బజారువీధి, ఎగువ, దిగువపద్మాశాలీ వీధి, తేరువీధుల్లో ఊరేగిన తర్వాత కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7గంటలకు శ్రీవారు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి నగర వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటం, చెక్కభజనల నడుమ శ్రీవారు భక్తులకు అభయమిచ్చారు. డిప్యూటీఇఒ నాగరత్న, ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, పుత్తూరు రూరల్ సిఐ భాస్కర్‌నాయక, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఎఎస్ఐలు జయరాంనాయక్, శ్రీనివాసులు, ఆశీర్వాధం, టిటిడి విజిలెన్స్ సిబ్బంది, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# బదిలీల వెనుక ఆంతర్యమేమిటో..?

### ద్రవిడ వర్సిటీలో బోధనేతర సిబ్బందికి అంతర్గత బదిలీలు



కుప్పం, మే 27 ప్రభాతవార్త ద్రవిడ విశ్వవిద్యాలయంలో పనిచేసు ్తన్న సుమారు పదిమంది రెగ్యులర్ బోధనేతర సిబ్బందికి అంతర్గత బదిలీలు చేస్తూ సోమవారం వర్సిటీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. వర్సిటీలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న పదిమంది ఉద్యోగులను బదిలీ చేశారు. కాగా హడావుడిగా ఒక్కసారిగా బోధనేతర సిబ్బంది బదిలీలు చేయడం పట్ల భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఉన్నట్టుండి తమను ఎందుకు వేరే శాఖలకు బదిలీ చేశారో అనే ఆందోళన సైతం బోధనేతర సిబ్బందిలో నెలకొంది. కాగా ఓ రెండు శాఖల్లో ఓ ఉద్యోగి పదిహేనేళ్లు, మరో ఉద్యోగి పన్నెండేళ్లుగా పనిచేస్తున్నా వారిని మాత్రం బదిలీ చేయలేదని సమాచారం. ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని వారి స్థానాల్లోనే కొనసాగిస్తూ ఇతరులను బదిలీ చేయడంలో ఆంతర్యమేంటనే సందేహాలు సైతం ఉద్యోగుల్లో ఏర ్పడ్డాయి. ఎన్నికల ఫలితాలు మరో వారం రోజుల్లో వస్తున్న నేపథ్యంలో తమను ఇంత హఠాత్తుగా ఎందుకు బదిలీ చేశారనే ప్రశ్న బదిలీ అయిన ఉద్యోగుల్లో నెలకొంది. ఈ విషయంగా ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాలరెడ్డిని 'ప్రభాతవార్త' వివరణ కోరగా వర్సిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె చేస్తున్నారని పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా బోధనేతర సిబ్బందికి అంతర్గత బదిలీలు చేశామన్నారు. ఎన్నికల కోడ్‌కు ఈ బదిలీలకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

# మద్దతు ధర లేక

శ్రీకాళహస్తి - ప్రభాతవార్త

' పంటలు పండించుటకు అప్పులు చేస్తే ఓ ధర, చేయకుంటే మరో ధర' గత ఏడాది ఎంతో ఆశాజనకంగా ఉన్న వరి మద్దతు ధర ఈ ఏడాది పూర్తిగా పడిపోయింది. రైతులు పండించిన రకం ధాన్యం ధరలు రైతుల్ని నిరాశకు గురిచేస్తున్నాయి.దాంతో ఆరుగాలం కష్టించి పండించిన రైతులకు కన్నీళ్ళు,కష్టాలు, అప్పుల తిప్పలు తప్పటం లేదు. గత ఏడాది పంటకోతల సమయంలోనే బస్తా వెయ్యిరూపాయలు చెల్లించి దళారులు తీసుకెళ్ళారు. ఈ ఏడాది సీజన్ పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు బస్తా ధర రూ.1200 కన్నా పెరగటం లేదని అన్నదాతలు ఆర్తనాదాలు చేస్తున్నారు. నిత్యావసర సరకుల ధరలు మార్కెట్‌లో దడ పుట్టిస్తుంటే, బియ్యం ధరలకు రెక్కలొస్తే వరి పంటకు మాత్రం ధరలు పలకటం లేదని వాపోతున్నారు.

**జిల్లాలో ధాన్యాగారం-రైతుల ఆర్తనాదం!**

ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని తూర్పు మండలాలైన శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లోని గ్రామాలు అధికారుల లెక్కల్లో ధాన్యాగారాలుగా ప్రసిద్ధి చెందాయి.అయితే ఈ ప్రాంతాల్లోని రైతులు గత ఐదేళ్ళుగా మద్దతు ధరల కోసం పోరాటం సాగిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సుమారు 50వేల ఎకరాల్లో వరి పంటను పండిస్తారు. తెలుగుగంగ పథకం వచ్చిన తరువాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం, సత్యవేడులోని బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో వరిపంటను రెండు కార్లు పండించే వారు.కానీ ఈ ఏడాది వర్షాభావంతో ఒక్కసారి వేసిన పంటను దక్కించుకోవటమే కష్టంగా మారింది. ఎందరో రైతులు నార్లు స్థాయిలోనే వదలుకున్నారు. అలాగే పిచ్చాటూరు,నాగలాపురం మండలాల్లో ఆరణియార్ ప్రాజెక్టు రైతుల పంటలకు ప్రాణంగా ఉన్నాయి. ఇక్కడ రైతులు ప్రస్తుతం రబీ,ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్నారు.వారి పంట పొలాల్లో ఉన్నపుడు ఆకాశానికి వెళ్ళి రైతుల్ని ఆశల పల్లకిల్లో పయనింపజేసే ధరలు కోతల సమయానికి ఉండటం లేదు. గతంలో రైతులు బిపిటి 5204 సోనా మసూర వరికి ఇక్కడ అనుకూల వాతావరణం లేకున్నా పోలోమని పండించారు. ఈ వరికి ఇక్కడ వాతావరణం సరిపోక రక రకాల తెగుళ్ళతో సతమతమయ్యారు. పంటకు తెగులు ఆశించిందనగానే రైతులు దుకాణం దారుల సూచనల మేరకు అన్ని రకాల మందులి ్న వాడారు పంట పెట్టుబడికన్నా అధికంగా తెగుళ్ళ నివారణకు వెచ్చించారు.ప్రతి ఏడాది రబీసీజన్‌లో స్వల్పకాలిక వంగడం ఎడిటి 37 (బుడొడ్లు) పండించే వారు ఈ సారి ఎందుకో రైతులు పండించలేదు. దాంతో ఆ రకం బియ్యం కోసం వరిని చెన్నై నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గిట్టుబాటు కాని ధరలతో రైతులు తిప్పలు పడి పండిస్తే గిట్టుబాటు ధర లేక తల్లడిల్లుతున్నారు.పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధరల్లేదు. ఇళ్ళలో నిల్వ చేసుకునే అవకాశం లేదు.దాంతో కల్లాల్లోనే నిల్వ ఉంచారు. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి పరిశీలిస్తే దళారులు ముందుగా అడ్వాన్సు ఇచ్చి ఉంటే బస్తా రూ.1200 మాత్రమే. అలా కాకుండా నగదు వ్యాపారం అయితే రూ.1150 మాత్రమే పలుకుతుంది. దాంతో పెట్టుబడులు కూడా రావనే అసంతృప్తి చోటు చేసుకుంది. ఇలా అయితే వ్యవసాయం ఏం చేయాలనే సందిగ్ధంలో రైతులు తల్లడిల్లుతున్నారు. ఇప్పటికి వరి కుప్పలు ఏ పంట పొలాల్లో అయినా దర్శనమిస్తున్నాయి.ఏ గ్రామంలో చూసినా పంట పొల్లాల్లో రోడ్ల పక్కన పట్టలు కప్పి కాపాడుకునే ప్రయత్నంలో రైతులు అవస్థలు పడుతున్నారు. ఓ వైపు రైతులు గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లుతుంటే మరో వైపు దళారుల మోసాలు షరా మామూలే అన్నట్లు మారింది. దళారుల త్రాసులు, తూకపు రాళ్ళు కొనుగోళ్ళలో ఒక రకంగాను అమ్మకాల్లోమరో రకంగా ఉంటున్నాయి. దాంతో రైతులు అడుగడుగునా మోసపోతున్నారు.

# రైతన్న విలవిల



కల్లాలోనే ఎండుతున్న వరి ధాన్యం

## అక్రమంగా తరలిస్తున్న తమిళనాడు రేషన్‌బియ్యం పట్టివేత

తవణంపల్లె, మే 27 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రమైన చిత్తూరు నుండి మండలంలోని కాణిపాకం పట్నం వైపు అక్రమంగా తరలిస్తున్న 35 బస్తాల రేషన్ బియ్యంను సోమవారం ఉదయం పట్టుకున్నట్లు స్థానిక ఎస్పై సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలావున్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు కాణిపాకం పట్నం వద్ద తవణంపల్లె మండల డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కుమార్, తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా రఫీ అనే వ్యక్తి చిత్తూరు నుండి కాణిపాకం పట్నం వైపు 35 బస్తాల తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యంను ఆటోలో తరలిస్తుండగా పట్నం బ్రిడ్జి వద్ద తనిఖీ చేసి పట్టుకుని ఆటోతో సహ బియ్యంను సీజ్ చేసినట్లు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

## నేటి నుండి ఐరాలలో శ్రీపాలేటమ్మ గంగ జాతర

ఐరాల, మే 30 ప్రభాతవార్త:



మండల కేంద్రం ఐరాలలో గార్గేయనదీ తీరంలో వెలసిన శ్రీపాలేటమ్మ గంగజాతర మంగళవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేవారు. ప్రతి ఏటగా ఆలయంలో గంగజాతర వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు మంగళవారం శ్రీపాలేటమ్మ ఆలయంలో 47వ గంగ జాతర వేడుకలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంకె.బాలాజి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. ఈసందర్భంగా ఆలయంలో వేకువజామున 3 గంటలకు అమ్మవారి శిరస్సు ప్రతిష్టించి 5 గంటలకు అమ్మవారికి తెరతీసి తొలిపూజలు నిర్వహించి భక్తు లకు దర్శనంతో జాతర ప్రారంభం కానుంది. బుధవారం అమ్మవారి నిమజ్జనం కార్యక్రమం జరుగనుంది.

## కాలువ కబ్జాకు ప్రయత్నం

### – అడ్డుకున్న తహసిల్దారు

శ్రీరంగరాజపురం, మే 27 ప్రభాతవార్త:



ఎస్ఆర్‌పురం మండలం మూలూరు చెరువుకు వచ్చే కుబేరు వంక కాలువ కబ్జా చేయడానికి ప్రయత్నించగా తహసిల్దారు అల్‌ఫ్రెడ్ అడ్డుకొన్నారు. కాలువను కబ్జా చేయడానికి ప్రయత్నించిన వ్యక్తికి సంబంధించి ఒక ఇటాచీ, నాలుగు ట్రాక్టర్లను తహసిల్దారు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని మాలూరు చెరువుకు కుటేరు వంక కాలువ ద్వారా నీరు వస్తుంది. ఈ కుటేరు వంక కాలువను కబ్జా చేసి తన భూముల్లో కలుపుకోవాలని నిర్ణయించిన రైతు అంకిరెడ్డి ఆదివారం కావడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు ఎవ్వరు వుండరని భావించి కాలువ భూమి కబ్జా చేయడానికి ప్రయత్నించాడు. హుటా హుటిగా ఒక ఇటాచి వాహనం, మరో మూడు ట్రాక్టర్లను తీసుకువచ్చి కబ్జా పనులు త్వరితంగా ముగించాలని భావించి పనులు ప్రారంభించాడు. అయితే స్థానికంగా ఇది నచ్చని కొంతమంది తహసిల్దారుకు సమాచారం ఇవ్వడంతో తహసిల్దారు హుటాహుటిన సంఘటనా స్థలంకు చేరుకొని జరుగుతున్న కబ్జాను ప్రయత్నించి వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## 10 లీటర్ల నాటుసారా పట్టివేత

### –ఇద్దరి అరెస్టు

పలమనేరు,మే 27,ప్రభాతవార్త:

మండలంలో అక్రమంగా నాటుసారా బట్టి నిర్వహిస్తున్న ఇద్దరిని సోమవారం పలమనేరు పోలీసులు అరెస్టు చేశారు.పోలీసుల వివరాల మేరకు...కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా కరిడిమడుగు గ్రామంలో పోలీసులు సోదాలు నిర్వహిస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో నాటుసారా తరలిస్తు పట్టుబడ్డారని తెలిపారు.వారిని విచారించగా వారి నివాసం వద్ద నాటుసారా ఊట ఏర్పాటు చేసినట్లు తెలిసిందని ఈ మేరకు ఆంజనేయులు(45),మునెప్ప(29) అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3000లు విలువ చేసే 10 లీటర్ల నాటు సారా,రూ.10 వేలు విలువ చేసే 200 లీటర్ల ఎఫ్‌జే నీటిని,ఓ ద్విచక్రవాహనాని సీజ్ చేసి సారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.



## ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేలా సహకరించాలి

### – కుప్పం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

కుప్పం, మే 27 ప్రభాతవార్త



సార్వ త్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జిల్లా కేంద్ర ం చిత్తూరులో జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పక్షాలు సహకరించాలని ఆర్ ్డఒ, కుప్పం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన రాజకీయ పక్షాల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4వతేది ఉదయం 8గంటలనుంచి పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుందన్నారు. కౌటింగ్ ఏజెంట్లుగా ఉన్నవారు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల కల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఆయా పార్టీల తరపున కౌంటింగ్ ఏజెంట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే తాము వారికి తగు గుర్తింపు పత్రాలు అందజేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఎన్నికల కమీషన్ సూచించిన ఆదేశాల మేరకే ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు అనంతరం ఇవిఎం మెషిన్ల ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించేది లేదని స్పష్టం చేశారు.మొత్తం 18 రౌ oడ్ల మేరకు కౌంటింగ్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ హరికుమార్, డిటి దేవరాజ్, రాజకీయ పక్షాల నేతలు పిఎస్ మునిరత్నం, మనోహార్, డాII వెంకటేష్, మురుగేష్, ఆవులగోపి, వసనాడు మురళి, డాII వరదరాజులు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్తలకు రాష్ట్ర నేత డాII సురేష్‌బాబు పరామర్శ

కుప్పం, మే 27 ప్రభాతవార్త



వేర్వేరు సంఘటనల్లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రాష్ట్ర తెదేపా కార్యదర్శి, కుప్పం టిడిపి విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాII బిఆర్ సురేష్‌బాబు పరామర్శించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 89 పెద్దూరుకు చెందిన శేషాద్రి, బాబునగర్‌కు చెందిన వేలును అతని ఇంట్లో పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కె.కన్నన్, నేతలు రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి కాలనీలో పోలీసులచే కార్డెన్ సెర్చ్

కుప్పంరూరల్, మే 27 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి అమరావతి కాలనీలో సోమవారం వేకువజామున జిల్లా ఎస్పీ మణి కంఠ చందోలు, డిఎస్పీ శ్రీనాథ్ ఆదేశాల మేరకు కుప్పం ఎస్పై సుబ్బారెడ్డి పోలీసు సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలో ఉన్న వారి ఆధార్‌కార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని పలు టువీలర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్పై మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రోడ్డు ప్రమాదంలో సరకల్లు ఏఎన్ఎం మృతి

తవణంపల్లె, మే 27 ప్రభాతవార్త:



(ఫైల్‌పోటో)

మండలంలోని అరగొండ-చిత్తూరు రహదారిలోని మత్యం క్రాస్ (తడకర) వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సరకల్లు సచివాలయ ఏఎన్ఎం మృతి చెందింది. వివరాలిలా వున్నాయి. మండలంలోని పత్రపల్లెకు చెందిన వై.వరలక్ష్మీ సరకల్లు సచివాలయ ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఈమె మండల కేంద్రం తవణంపల్లె పీహెచ్‌సీలో జరిగే సెక్టార్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు తన భర్త మధుబాబుతో కలసి మోటారు సైకిల్‌పై బయలు దేరింది. వీరు మత్యం క్రాస్ వద్ద వెళుతుండగా కుక్క అడ్డంగా రావడంతో మోటారు సైకిల్ అదుపు తప్పడంతో వరలక్ష్మీ మోటారు సైకిల్‌పై నుండి కింద పడింది. దీనితో వరలక్ష్మీకి తలకు బలమైన గాయమై స్పృహ కోల్పోయింది. ఈమెను వెంటనే చికిత్స నిమిత్తం అరగొండ అపోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈమెకు భర్త ఇద్దరు పిల్లలు వున్నారు. విధులకు హాజరయ్యేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో వరలక్ష్మీ మృతి చెందడంతో మండల వైదా ్యధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈమేరకు మృతురాలి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసుల తెలిపారు.

## కుటుంబ కలహాలతో తనయునిపై దాడి

తవణంపల్లె, మే 27 ప్రభాతవార్త:



కుటుంబ కలహాల కారణంగా తండ్రి తనయునిపై కత్తితో దాడిచేసి తీ వ్రంగా గాయపరచిన సంఘటన మండలంలోని వెంగంపల్లెలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని వెంగంపల్లెకు చెందిన మునిరెడ్డి అతని కుమారుడు మధుసూధన్‌రెడ్డికి మధ్య ఆస్థి విషయమై కొంతకాలంగా గొడవలు జరుగుతు న్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి వారిద్దరి మధ్య మాటామాటా పెరగడంతో మునిరెడ్డి ఇంట్లో వున్న కూరగాయలు కోసే కత్తితో కుమారుడు మధుసూధన్‌రెడ్డిపై దాడి చేసి వీపుపై బలంగా పొడిచాడు. దీనితో అతనికి తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే తీవ్రంగా గాయపడిన మధుసూదన్‌రెడ్డి చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.ఈమేరకు స్థానిక పోలీసులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది.

## నేడు రైల్వే కాలనీ శ్రీశ్రీశ్రీ గొల్ల గంగమ్మ జాతర

పాకాల, మే 27, ప్రభాతవార్త



పాకాల స్థానిక రైల్వే కాలని (60 యూనిట్)లో భక్తుల కోరికలను తీర్చే అమ్మగా కొలువైన శ్రీశ్రీశ్రీ గొల్ల గంగమ్మ తల్లి జాతరను ప్రతి యేట తిరుపతి జాతర ముగిసిన తరువాత వారమైన ఈ నెల 28వ తేది మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. స్థానిక రైల్వే 60 క్వార్టర్స్ యూనిట్ పాత రైల్వే ఎంప్లాయిస్ పిల్లలు సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన అందరూ కలిసికట్టుగా జరుపుకున్న పండుగ సందర్భంగా కావటం విశేషం. ఇప్పుడు ఉన్న యూత్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించనున్నారు. ఈ సంబరాలలో భాగంగా ఉదయం నుంచి రైల్వే కాలనీ వీధులలో విచిత్ర వేషధారణలతో ఊరేగింపుగా తిరిగి అమ్మవారికి అభిషేకం నిర్వహించి అనంతరం అంబలి వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారికి సాయంత్రం పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం జర్గిగిన తరువాత అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## బిసిజి టీకాలపట్ల అపోహలొద్దు : డాక్టర్ పూజ

చౌడేపల్లి, మే 27 ప్రభాతవార్త



బిసిజి టీకాలపట్ల అపోహలొద్దని మండల వైద్యాధికారిణి డాక్టర్ పూజ అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకే బిసిజి టీకాలు వేస్తున్నామన్నారు. టీకాలు వేసుకొన్న 15రోజులపాటు కొంతమేర నొప్పి ఉటుందనీ, ఎలాంటి చికిత్స అవసరం లేదన్నారు. క్షయవ్యాధి సోకి బాగుపడ్డ కుటుంబ సభ్యులకు, దీర్ఘకాలిక వ్యాధి అయిన మధుమేహ గ్రస్తులకు బిసిజి టీకాలు వేయడంలో ప్రాధాన్యత ఉంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 18యేళ్ళ పైబడ్డ వారందరికీ టీకాలు వేస్తున్నట్లు వివరించారు. ఏదైనా సందేహాలుంటే నేరుగా తనను ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది హాజరయ్యారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఒడుగులతో వ్యాధులు దూరం

షఫీ మౌలానా

గూడూరు, మే 27, ప్రభాతవవార్త




ఒడుగులు చేయించుకుంటే చర్మవ్యా ధులు దరిచేర వని మత గురువు షఫీ మౌలానా పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని షాదీమం జిల్‌లో ఇన్సాఫ్ సమితి ఆధ్వర్యంలో ఉచిత సామూహిక ఖత్నా(ఒడుగులు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది రోజుల బాలుడి నుండి 12 ఏళ్లలోపు వయసున్న ముస్లిం బాలురకు ఒడుగులు తప్పనిసరి అని మహమ్మద్ ప్రవక్త సూచించారన్నారు. ఒడుగులు చేయిస్తే అనేక రకాల వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని సాక్షాత్తు శాస్త్రవేత్తలు ధృవీకరించారన్నారు. కేవలం ముస్లింలు మాత్రమే కాకుండా అనేక దేశాలలో ముస్లిమేతరులు కూడా సున్తీ చేయించుకోవాలని స్వయంగా వైద్యులు సూచిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి గూడూరు, చెన్నూరు, విద్యా నగర్, కోట, విందూరు ప్రాంతాల నుండి 27 మంది చిన్నారులు ఒడుగులు చేయించుకున్నారని తెలిపారు. సామూహిక ఉచిత ఒడుగుల కార్యక్రమానికి సహకరించిన పట్టణ మైనారిటీ సోదరులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అహ్మద్, ఇర్షాద్, మైనారిటీ సెల్ సీనియర్ నాయకులు ఎండి అన్వర్ భాష, జిలానిభాయ్, ఖాదర్ భాష, లలితా మెడికల్స్ యూసుఫ్ భాయ్, యస్దాని భాయ్, షేక్ హాషిం, జమల్, సయ్యద్, అల్తాఫ్ సయ్యద్, నయీమ్, షేక్ నజీమ్ భాయ్, షేక్ కబీర్, మహబూబ్ అలీ, హసన్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషను విస్మరించరాదు

గుర్రాల రమేష్

వెంకటగిరి టౌన్, మే 27, ప్రభాతవార్త



తెలుగు భాషను విస్మరించరాదని లెక్చరర్ గుర్రాల రమేష్ తెలిపారు. పట్టణంలోని మహాత్మా గాంధీ గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా శతక పద్యాల పై ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతక పద్యాలలో ఎంతో నీతి ఉందని తెలిపారు. ఆంగ్లంపై మక్కువ చూపి తెలుగు విస్మరిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మృతి

కోట, మే 27 ప్రభాతవార్త

కోట మండలం గోవిందుపల్లి గ్రామంలో కృష్ణయ్య (60) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. కృష్ణయ్యది చిల్లకూరు మండలం కమ్మరివాపాలెం గ్రామం. గోవిందుపల్లిలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి కుమార్తె నివాసం వద్ద కృష్ణయ్య మృతిచెందాడు. దీంతో బంధువు కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

## ఆటోలు ఢీకొని ఐదుగురికి గాయాలు

గూడూరు, మే 27, ప్రభాతవార్త



గూడూరు పట్టణ శివారు పరిధిలోని టిడ్కో ఇండ్ల సమీపంలో ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొని ఐదు మందికి గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీస్‌ల కథనం మేరకు గూడూరు మండల పరిధిలోని కాంద్రా గ్రామం నుండి గూడూరుకి వస్తున్న ఆటో అదే మార్గంలో గూడూరు నుండి కాంద్రాకి వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. కాంద్రా గ్రామానికి చెందిన శ్రీను, రమణయ్య, ఆఫీజ్ ఇమ్రాన్ గాయపడ్డారు. క్షతగాత్రుల 108 వాహనం ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకి తరలించారు. అనంతరం గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## నైరుతి వచ్చే వరకు భగభగలే

కోట, మే 27 ప్రభాతవార్త

వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే భానుడి భగభగలు మొదలయ్యాయి. ఏప్రిల్ నెలలో తీవ్ర వడగాల్పులకు తోడు గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మే నెలలో పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. తుపాను ప్రభావంతో పొడి వాతావరణం నెలకొని జిల్లాలో వేడి, ఉక్కపోతలు పెరిగాయి. నైరుతి రుతుపవనాలు వచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, వడగాలులు తీవ్రరూపం దాల్చుతాయని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. సోమవారం నుంచి జూన్ 3వ తేదీ వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. వేడి, ఉక్కపోత వల్ల చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో వేడి వాతావరణం నెలకొంటుంది. ఎండ వేడికి తేమ తోడవడంతో చర్మం జిడ్డుగా మారుతుంది. సముద్ర తీరానికి సమీపంలో ఉన్నా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

## కొత్తపాలెంలో భయం భయం

కోట, మే 27 ప్రభాతవార్త

కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో అతి దారుణంగా గాయపరిచాడు. శ్రీనివాసులు అనే వ్యక్తి పోలయ్య అనే వ్యక్తిని కత్తితో పలుచోట్ల గాయపరిచాడు. అయితే అక్రమ సంబంధం వల్లే శ్రీనివాసులు దాడికి పాల్పడినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బాధితుడు గూడూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అయితే పోలీసుస్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగబాబు చెప్పారు. దాడి చేసిన వ్యక్తి బహిరంగంగా తిరుగుతున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

దొరవారిసత్రం మే 27 ప్రభాతవార్త ;

మండలంలోని వెదురుపట్టు రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో వేలూరు శ్రీహరి(24)అనే యువకుడు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు సూళ్ళూరుపేట బాపూజీ కాలనికిచెందిన శ్రీహరి దొరవారిసత్రం మండలం వెదురుపట్టురోడ్డు సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా నెల్లూరు నుండి చెన్నై వైపువెళుతున్న మాటార్ సైకిల్ ప్రమాదవశాత్తు ఢీకొంది.దీంతో వేలూరు శ్రీహరి తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని 108సహాయంతో చికిత్స నిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీహరి మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. దొరవారిసత్రం ఎస్పై జె తిరుమలరావు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

## సూళ్లూరుపేటలో ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి



సూళ్లూరుపేట, మే 27 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్‌టి రామారావు జయంతిని పురస్కరించుకొని ముందస్తుగా సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. మహానాడును ఎన్‌టిఆర్ జన్మదినానికి గుర్తుగా మే 27, 28 తేదీలలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా మహానాడు వాయిదా పడటంతో ఆ ఆనవాయితీని తప్పకుండా నెరవేర్చే కార్యక్రమంలో భాగంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. బిసి నాయకులు చిట్టేటి పెరుమాళ్ళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మెస్ రమణయ్య, పి.సుబ్బయ్య, బుద్ధి విజయలక్ష్మి, మంజుల, ఎస్ఎన్ మునిరాజా, దంతాల రవి, బట్టా సుబ్రహ్మణ్యం యాదవ్, నలజాం రాము తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి వేరుసెనగ విత్తనాలు పంపిణీ

యర్రావారిపాలెం,మే27ప్రభాతవార్త

మండల పరిధిలోని రైతులకు ఈనెల 29 నుంచి వేరుసెనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఖాదర్‌భాషా తెలిపారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి విత్తనాలు పొందవచ్చునని ఆయన చెప్పారు. మండలానికి 750 క్వింటాళ్ల వేరుసెనగ వచ్చాయని, కాలసిన రైతులు ఆదార్‌కార్డు,1బి తీసుకుని రావాలన్నారు. కె6 రకం 30కిలోలబస్తారూ.1710కి,కదిలేపొక్షిరకం30కిలోల బస్తా రూ.1560 చొప్పున అందిస్తామని పేర్కొన్నారు.

## దుస్థితిలో గొడ్డేరు డ్యామ్

వెంకటగిరి టౌన్, మే 27, ప్రభాతవార్త



కరువుతో అల్లాడుతున్న కొండ కింద గ్రామాల రైతుల కోసం సాగునీరు అందించేందుకు నిర్మించిన గొడ్డేరు ఆనకట్ట నిరుపయోగంగా మారింది. 14 చెరువులకు నీరు అందించేందుకు గాను గొడ్డేరు నదిపై మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్థన్ రెడ్డి గొడ్డేరు ఆనకట్టను నిర్మించారు. జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న ఈ గొడ్డేరు ఆనకట్ట మరమ్మత్తులను పట్టించుకోక వదిలేయడం వల్ల దుస్థితికి చేరింది. చెరువులకు నీరు విడుదల చేసే షట్టర్ల తుప్పు పట్టి శిథిలం అవుతున్నాయి. 1992 సంవత్సరంలో గొడ్డేరు ఆనకట్ట నిర్మించారు. గొడ్డేరు ఆనకట్ట దుస్థితికి చేరుకోవడం వల్ల చెరువులకు నీరు చేరడం లేదని రైతులు వాపోతున్నారు. కొండ కింద గ్రామాల్లో ఉన్న చెరువులకు వర్షాలు పడితేనే నీరు చేరుతాయి. గొడ్డేరు డ్యాం వద్ద కుడి, ఎడమ, కాలువలను తవ్వి చేరువుకు నీరు పారించే విధంగా ఏర్పాటు చేసారు. అయితే ఈ కాలువలు కూడా పూడిపోయినట్లు రైతులు ఆవేదన చెందారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు..డిఎస్పీ

శ్రీకాళహస్తి, మే 27 ప్రభాతవార్త



జూన్ 4వతేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియ మరియు ఫలితాలు విడుదలకు సంబందించిన ఎలాంటి అల్లర్లు గొడవలు జరగకుండా పోలీసులు సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సెంట్రల్ పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందనకభంగా డిఎస్పీ మాట్లాడుతూ ఫలితాల ముందుకానీ తర్వాత కానీ చట్టం ఉల్లంఘించి అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటలామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎక్కడా ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలుతీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ నరసింహారావు ఎస్సైలు బాబు, టుటౌన్ఎస్ఐ విజయభాస్కర్‌రాజు, రెండో పట్టణ పోలీసు స్టేషన్ సిబ్బందితోపాటు 40మంది కేంద్రబలగాలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, మే 27 ప్రభాతవార్త



పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్. శ్రీనివాసులురెడ్డి (53) సోమవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. 1997లో స్కిట్ కళాశాలలో ఫిజిక్స్ ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసి 2006లో పర్మినెంట్ ఆయిన శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు ఆర్థిక ఇబ్బందులతో పాటు, చక్కెర వ్యాధితో గత కొద్దిరోజులుగా బాధడపతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబానికి పలువురు సంతాపం తెలిపారు.

## 30,31న గుంటూరులో ఉచిత వక్త శిక్షణా తరగతులు

: కోఆర్డినేటర్ గురుమూర్తి

నారాయణవనం, మే 27 ప్రభాతవార్త :

ఈనెల 30,31వ తేదీల్లో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేక్కలులోని రమణరావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో స్టెప్(స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్) వారి ఆధ్వర్యంలో ఉచితంగా వక్త శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా కో-ఆర్డినేటర్ గురుమూర్తి తెలిపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు వారి ఆధ ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులను ఇస్తారన్నారు. ఎపి ఉమ్మడి రా ష్ట్రాలు నలుమూలల నుంచి సుమారు 100మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ శిక్షణా తరగతుల్లో సుమారు 10 అ ంశాలపై నిష్ణాతులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందనా న్నరు. 29వ తేది సాయంత్రమే శిక్షణ కేంద్రానికి హాజరవ్వాలన్నారు. ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 9491509440, 9491710716 నంబర్లకు ఫోన్ చేసి పూర్తి సమాచారం పొందవచ్చన్నారు.

## 31 నుంచి అంకమ్మ తిరుణాళ్ల

పుత్తూరురూరల్, మే 27 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్ళ ఈ నెల 31వ తేదీ నుంచి నాలుగు రోజులు పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు ఓ ప్రకటనలో తెలిపారు. 31 తేదీ శుక్రవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, సాయంత్రం 3 గంటల నుంచి పురవీధుల్లో గెరిగె ఊరేగింపు ఉంటుందన్నారు. 1న శనివారం ఆలయ ఆవరణలో పోతురాజు ముగ్గు కార్యక్రమం, 2న ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం ఆలయ ఆవరణలో పొంగళ్లు, సాయంత్రం భక్తులు పసుపు వస్త్రాలు ధరించి వేపాకు చేత పట్టుకుని అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం, రాత్రి 9 గంటలకు అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం, అలాగే 3వ తేదీ సోమవారం వసంతోత్సవ కార్యక్రమంతో తిరుణాళ్ళ ముగుస్తుందని గ్రామస్థులు తెలిపారు. ప్రతిరోజు మూడు రోజుల పాటు ఆలయ ఆవరణలో రాత్రి సమయంలో అంకమ్మ కథ కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. ప్రత్యేక అనవాయితీగా ఇతరులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు వివరించారు.

## డ్యూటీ సర్టిఫికెట్లు జారీచేయమని వినతి..యుటిఎఫ్

శ్రీకాళహస్తి, మే 27 ప్రభాతవార్త



డ్యూటీ సర్టిఫికెట్లు జారీచేయమని సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద యుటిఎఫ్ నాయ కులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 168 శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈనెల 12,13 తేదీల్లో ఎన్నికల విధులు మరియు ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరైన సిబ్బందికి ఎన్నికలు పూర్తయ్యే వరకు రెండు వారాలు గడుస్తున్నా డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో శ్రీకాళహస్తిడివిజన్ యుటిఎఫ్ నాయకులు ఆర్టీవో కార్యాలయం ముందు పలు మండలాల అధికారుల ద్వారా పంపిణీచేయాలని నిరసన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కె.మోహన్‌బాబు, ఓ.విజయకుమార్, ఆడిట్ కమిటీ సభ్యురాలు ఓ.దీపిక, తొట్టంబేడు మండల గౌరవాధ్యక్షుడు కె.సుబ్రమణ్యం అధ్యక్షులు జి.గిరిబాబు తదితరలు పాల్గొన్నారు.

# విస్తీర్ణం ఎంతైనా ఒక్కటే బస్తా

-వేరుశనగ విత్తనాల కోసం రైతుల ఆందోళన

-వ్యవసాయ అధికారులతో రైతుల వాగ్వాదం




వి.కోట,మే 27,ప్రభాతవార్త:

వి.కోట మండలంలో రాయితీ వేరుశెనగ విత్తనాల పంపిణీలో వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొటోచ్చినట్టు కనబడింది.రైతలు సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనలను అధికారులు తెప్పించాల్సి ఉండగా అధికారి నామమాత్రంగా విత్తనాలు తెప్పించారు.ఈ క్రమంలో జవునిపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీ వేరుశెనగ విత్తనాల పంపిణీ సోమవారం వ్యవసాయ సిబ్బంది చేపట్టారు.విత్తనాల కోసం రైతులు బారులు తీరారు.వివరాలు నమోదు అనంతరం ఒక్కో రైతుకు ఒకటే బస్తా పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.దీంతో విస్తీర్ణానికి అనుగుణంగా రెండు బస్తాలైన పంపిణీ చేయాలని రైతులు అధికారుతో వాగ్వాదానికి దిగారు.రైతుల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు ఎందుకు తెప్పించలేదని రైతులు అధికారులను నిలదీశారు.ఒక బస్తాతో రైతులు పంట పండించలేరా అంటు నిర్లక్ష్య సమాధానంతో అధికారి జారుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల తీరు పై రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులు పోటెత్తడంతో పోలీసులతో కట్టడి చేసే ప్రయత్నం చేశారు.గ్రామం పంచాయితీలో సుమారు 1000 ఎకరాల వర్షాధారిత పంట అయిన వేరుశనగ సాగు చేస్తారు.అయితే విస్తీర్ణతను గుర్తించి విత్తనాలను మండల వ్యవసాయ శాఖ అధికారులు తెప్పించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి రైతుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకుంటు రైతులకు వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

## మూలన పడి ఉన్న ఆర్‌వో ప్లాంట్

సత్యవేడు, మే 27 ప్రభాతవార్త:



సత్యవేడు ప్రభుత్వ పెద్దాస్పత్రిలో దాతలు అందించిన వివిధ పరికరాలు తుప్పు పడుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడం, వినియోగంపై నిర్లక్ష్యం, సిబ్బంది బాధ్యతారహితం వల్ల ఆస్పత్రిలో నీటిని శుద్ధి చేసి ఆర్‌వో ప్లాంటు అలంకార ప్రాయంగా మారింది. వీటి మరమ్మతుకు ఇప్పటికే కొంత నిధులు ఖర్చు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మంచినీటి కొరకు ఇక్కడికి వచ్చే రోగులు, స్థానికులు దప్పిక కేకలతో అవస్థలు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి మరమ్మతులు చేయించాల్సిందిగా రోగులు వాపోతున్నారు.

## పాఠశాలలు ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలు కల్పించాలి

- ఎంఈవో

పుత్తూరురూరల్, మే 27 ప్రభాతవార్త:



పుత్తూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో నాడు-నేడు ఫేస్-2 ప్రధానోపాధ్యాయులకు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, సీఆర్ఎంటీలకు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నాడు-నేడు పెండింగ్ వర్కులు గురించి చర్చించారు. పాఠశాలలు రీ ఓపనింగ్ నాటికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో మేజర్ అండ్ మైనర్ రిపేరు, ఎలక్ట్రిఫికేషన్, టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, తాగునీరు వంటశాల, పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండాలని తెలిపారు. అదే విధంగా పాఠశాలలో వంట చేసే వర్కర్లకు 30వ(గురువారం) మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఎగువ కనకంపాళెంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ప్రతి పాఠశాల నుంచి ఒక్కోవంతు మనిషి హాజరయ్యేటట్టు కావాలని హెచ్ఎం బాధ్యత వహించాలని తెలిపారు. విద్యా కానుక కిట్లు అందరికి అందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే "నాకా బందీ"

ఎస్ఐ చిరంజీవి

రామచంద్రాపురం, మే 27 ప్రభాతవార్త:

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పకడ్బందీగా నాకా బందీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. సోమవారం ఆయన అనుప్పల్లి పంచాయతీలో నాకా బంధీ చేపట్టారు. ప్రతి ప్రాంతాన్ని, అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 7 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. జూన్ 4న కౌంటింగ్ దృష్ట్యా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యోగు, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

## కైలాసనాథ్ సదన్‌లో త్రిదళ బిల్వ వృక్షాలు



శ్రీకాళహస్తి,మే 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబం ధంగా కైలాసగిరుల్లోని భరద్వాజతీర్థం లోని కొండ కోనల్లో నర్సరీని అభి వృద్ధి పరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ నక్షత్రవనం అనే వనంలో వివిధ ఔషధ చెట్లను పెంచుతు న్నారు.ఈ నేపథ్యంలో ఇటీవల ఈ నర్సరీకి నెల్లూరు వాస్తవ్యులు ఎన్‌టిఆర్ గ్రూప్ అఫ్ ఇండస్ట్రీస్ చైర్మెన్ ఆదికేశవ రెడ్డి గతంలో 700 త్రిదళ పత్రం బిల్వాన్ని అందించారు. వీటిని కైలాసగిరుల్లో నాటి అభివృద్ధి చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్నిచ్చే ఇలాంటి వృక్షాలతో భక్తులకు మంచి గాలిని అందించేందుకు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవ చూపారు.సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు అంటారు.ఆ రోజు ఆయనకు ఇంకా ప్రీతి పాత్రమైన త్రిదళ బిల్వ వృక్షాలను 200 మొక్కలను కైలాససదన్ అతిథి గృహం వద్ద నాటారు.ఈ కార్యక్రమాల్లో చైర్మెన్‌తో పాటు ఎసి మల్లికార్జున్ ప్రసాద్, నర్సరీ ఇన్‌చార్జి శివకుమార్, సిబ్బంది పసుపులేటి కామేశ్వరరావు నర్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఊరందూరులో పార్వేట ఉత్సవం

శ్రీకాళహస్తిరూరల్, మే 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయంలో సోమవారం కన్నుల పండువగా పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా అలంకరించారు. పల్లకిలో ప్రతిష్టించారు. ఆలయ పూజారి ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. తరువాత చుట్టుపక్కల గ్రామాలకు పార్వేటను నిర్వహించారు.ఆశ్వవాహన సేవను నిర్వహించారు. తరువాత ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్, చిన్న ఆలయాల నిర్వహణ ఇన్‌చార్జి లక్ష్మయ్య, సహాయకుడు దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఉభయదారులు కందాటి మునికృష్ణారెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు భవిత పాఠశాలలు వరం

శ్రీకాళహస్తి, మే 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని సోమవారం ఉదయం సమగ్ర శిక్షన కార్యాలయంలో ఐ కోర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఆదేవిధంగా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డిలు భవిత స్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు జనార్ధన్ మండల ఎంఐఈ కోఆర్డినేటర్ మాధవయ్య, క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్ ప్రదీప్‌కుమార్ తదితరలు టిఎంవి కండ్రిగ గ్రామంలో శేఖర్ మరియు లత కుమారుడు వరుణ్‌రెడ్డి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రతిభావంతుల ఇండ్లకు వెళ్ళి వారిని గుర్తించారు. వారికి వారి తల్లిదండ్రులకు జిల్లా కోఆర్డినేటర్ భరోసా ఇచ్చి వీరి మారసిన ఎదుగుదలకు భవిత పాఠశాల ఎంతో ఉపయోగంగా ఉంటుందని భవిత పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు వీరికి శిక్షణ ఇవ్వడంలో ప్రత్యేక అనుభవం కలిగిన వారు కనుక భవిత పాఠశాలలకు తీసుకువెళ్ళి చేర్పించాల్సిందిగా కోరారు. అదేవిధంగా విద్యార్థికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను కల్పిస్తామనీ హామీ ఇచ్చారు.

## సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాల కవాతు

.తొట్టంబేడు, మే 27 ప్రభాతవార్త

వచ్చేనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలకు సంబందించి కౌంటింగ్ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, పంచాయతీలైన పూడి, గుర్రప్పనాయుడుకండ్రిగ, కొణతనేరి గ్రామాల్లో తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు, సిఆర్‌పిఎఫ్ పోలీసులు, స్థానిక పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ రాఘవేంద్ర మాట్లాడుతూ కౌటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా గ్రామాల్లో వివాదాల చెలరేగినా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# తిరుపతి డివిజన్

## కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కేవీబీ పురం, మే 27 ప్రభాతవార్త:



మండలంలోని కేవీబీ పురం, మహాదేవపురం, రాజుల కండ్రిగ, మఠం, పెరిందేశం, రాగిగుంట, కొత్తూరు, తిమ్మసముద్రం, బైరాజు కండ్రిగ పంచాయతీల్లో మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో వెదజల్లుతున్నాయి. మురికి కాలువలో తాగునీరు సరఫరాఅయ్యే పైపులైన్లు ధ్వంసం అయ్యాయి. ప్రతి ఫలంగా తాగునీరు, మురుగునీరు కలిసిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు కూడా నీరే కదా అని వదిలేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు తప్పే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. కాలువలో ఎటుపోక వీధుల మీద పారుతుండడంతో పలు రోగాలకు గురవుతున్నారని వాపోతున్నారు. రోడ్డుపై మురుగు నీరు నిల్వ చేరడంతో ఆ నీటిపై దోమలు చేరి రోగాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని దెబ్బతిన్న పైపులైన్లకు, కాలువలను మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు.

## తవ్వకాల్లో తాగునీటి పైపులైన్లు ధ్వంసం

పట్టించుకోని అధికారులు - తాగునీటి కోసం అవస్థలు

కేవీబీ పురం, మే 27 ప్రభాతవార్త:

మండలంలో జరుగుతున్న బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ ఏర్పాటుకు స్వార్థ కాంట్రాక్టర్లు తవ్విన గుంతలు కేవీబీ పురం మండల ప్రజల పట్ల యమపాసాలుగా ఫైబర్ నెట్ గుంతలు తవ్వి అలాగే వదిలేశారు. ఆ గుంతల వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇదే కారణంగా కాళహస్తిలో కూలి పనులు ముగించుకుని సొంత గ్రామాలకు చేరాల్సిన పవనివారి కండ్రిగ, కోవనూరు, కర్లపూడి, పెరిందేశం, మఠం గ్రామాల్లో రాత్రిసమయంలో ఎక్కడ నడవాలో తెలియక ప్రమాదాలకు గురవుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తవ్వకాల్లో తాగునీటి పైపులైన్లు ధ్వంసం కావడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నట్లు గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు పట్టించుకోవాలని వారు కోరారు.

## కౌంటింగ్ నిబంధనలు తప్పక పాటించాలి

నగరి, మే 27 ప్రభాతవార్త:



కౌంటింగ్ నిబంధనలు తప్పని సరిగా రాజకీయ పార్టీలు పాటించాలని ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ భద్రతా ఇన్‌చార్జి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అన్ని పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, కౌంటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన ఏర్పరచారు. నగరి నియోజకవర్గానికి సంబంధిత కౌంటింగ్ పూతలపట్టు ఆర్‌కేఎం లా కాలేజీలో జరుగుతుందన్నారు. కౌంటింగ్‌లో 14 టేబుల్స్ ఉంటుందన్నారు. టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకోవచ్చన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ముగ్గురు ఏజెంట్లను నియామకం చేసుకోవచ్చన్నారు. ఇలా పోటీ చేసిన ఒక్కో అభ్యర్థి 17 మంది ఏజెంట్లను నియమించుకోవచ్చన్నారు.ఈ సమావేశంలో నియోజకవర్గానికి సంబంధిత అసిస్టెంట్ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## మాసికా మహోత్సవ్ ఫెస్టివల్

నగరి, మే 27 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో మాసికా మహోత్సవ ఫెస్టివల్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కిశోర బాలికలతో మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు శానిటరీ ప్యాడ్స్ వినియోగించడం గురించి అవగాహన ఏర్పరచారు. అవగాహన ఏర్పరచుకున్న విషయాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్.శంకరమ్మ, ఎంఎస్‌కే అలేఖ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహనాల తనిఖీలు

రేణిగుంట, మే 27 ప్రభాతవార్త:



రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో సోమవారం వివిధ మార్గాల్లో ఎన్నికల ఫలితాల కౌంటింగ్‌ని పురస్కరించుకుని ముందస్తు భద్రతా చర్యలో భాగంగా వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. రేణిగుంట- తిరుపతి మార్గంలోని పారిశ్రామిక వాడ వద్ద పోలీసులు అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డిక్కీలను, బ్యానట్లను ఓపెన్ చేసి తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను సీఐ మల్లికార్జున్ ప్రశ్నించారు. లారీలను, బస్సులను, ఇతర వాహనాలను నిలిపి లోపలకు ఎక్కి నిశితంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచనలతో డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా వాహనాల్లో మద్యం, పేలుడు పదార్థాలు, మారణాయుధాలు, మండే స్వభావం కలిగిన పెట్రోలియం ఉత్పత్తులు తరలించకూడదన్నారు. తరలిస్తూ పట్టుబడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మాధవికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి విద్య, మే 27, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖ విభాగ పరిశోధనా విద్యార్థిని కె. మాధవికి డాక్టరేట్ ప్రధానం చేశారు. డాక్టర్ వై సుభాషిణి ఆధ్వర్యంలో పోతన భాగవతం - అద్వైత తత్వం అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ప్రొఫసర్స్ మాధవికి అభినందనలు తెలిపారు.

## ఘనంగా విజయ్‌బాబు జన్మదినోత్సవం

పుత్తూరు, మే 27 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని ఎంబి రోడ్డులోని ఆయన కార్యాలయంలో టిడిపి నాయకులు, అనుచరులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. అలాగే నగరి పట్టణంలో దేశమ్మ గుడి వద్ద తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పెమ్మసాని సుమన్‌నాయుడు ఆధ్వర్యంలో విజయ్‌బాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేయడంతో పాటు అన్నదానం చేశారు. పుత్తూరు కార్యక్రమంలో పరమేశ్వరమంగళం ఎంపిటిసి సభ్యులు శ్రీజ బాలాజీనాయుడు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇ.రవినాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, సూపర్‌బజార్ చైర్మన్ చంద్ర యాదవ్, వైస్‌చైర్మన్ పోతుగుంట రమేష్, టిఎన్‌టియుసి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అరవ ప్రకాశ్, ఇంకా నాయకులు దాసరి విజయ్‌చౌదరి, బాబు రాయల్, కుమార్‌రెడ్డి, పరంధామ్, వంశీ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు. నగరి కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్ నాయుడు, ఎం.వి.ఢిల్లీబాబు, వంశీ, లోకేష్‌నాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలు మార్చి ఏనుగుల దాడులు



సదుం,మే27ప్రభాతవార్త : మండల పరిదిలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. గతంలో చెరకువారిపల్లె, బూరగమంద, జోగివారి పల్లె పంచాయతీలలో ఏనుగులు సంచరిస్తూ పంటలు నాశనం చేస్తూ ఉండేవి. ఎవరూ ఊహించని విధంగా మండల పరిదిలోని తాటిగుంట పాలెం పంచాయతీలో ఏనుగులు ప్రత్యక్షమ వ్వడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అటవీ సరిహద్దులు లేని గ్రామానికి ఏనుగులు ఎక్కడెక్కడో తిరిగి రావడం చెప్పుకోదగ్గ పరిణామం. ఇందులో బాగంగా ఆదివారం రాత్రి చింతలవారిపల్లె పంచాయతీలోకి ఏనుగులు ప్రవేశించాయి. ఆ గ్రామానికి చెందిన కె.దేవేంద్రరెడ్డి, ఏ.రమణ, ఆర్. శ్రీరాములు, నారాయణరెడ్డి తదితరులకు చెందిన 15ఏకరాలలో ఏనుగులు సంచరించాయి. ఆతోటలలోని మామిడి కాయలను తిన్నాయి. చెట్ల కొమ్మలను విరిచాయి. ఏనుగులు ఇంత దూరం వచ్చి పంటలపై పడ్డాయని అనుకున్నారు. అసలే మామిడి దిగుబడి తక్కువ. అదేసమయంలో మామిడి కాయలకు ధర అదికంగా పలుకుతోంది. జోగివారిపల్లె పంచాయతీలోని ఏనుగులు బూరగమంద పంచాయతీ మీదుగా తిరుపతి పుంగనూరు ప్రధాన రహదారిని దాటి శివశక్తి డెయిరీ పక్కలో దూరి చింతలవారిపల్లె పంచాయతీలోకి ప్రవేశించాయి. అక్కడ ఏనుగులు పడ్డాయి ఇక్కడ ఏనుగులు అంటూ వస్తున్న వార్తలను చూసి చెప్పుకునే ఈ ప్రాంత ప్రజలు తామే వాటి బారిన పడటం చెప్పుకోదగ్గ విషయం.

# చెవిరెడ్డి అవినీతి బాగోతాన్ని బయటపెడతా!

-స్వంత పార్టీ నాయకులనే మోసం చేసిన ఘనుడు చెవిరెడ్డి

-చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి



తిరుపతిరూరల్, మే 27 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అవినీతి బాగోతాన్ని బయటపెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తెలిపారు. చెవిరెడ్డి తన అనుచరులతో తనపై హత్యాయత్నానికి ప్రయత్నించి, అడ్డంగా బుక్కాయ్యాడని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి అవినీతి దురాగతాలు అన్ని, ఇన్నీ కావని, ఆధారాలతో అన్ని బయటపెడతానని తెలిపారు. మట్టి, ఇసుక, ఎర్రచందనం, గ్రావెల్ అక్రమ వ్యాపారాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలల్లో నెలవారి ముడుపులు తీసుకున్న ఘనత కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డికే దక్కుతుందన్నారు. సోమవారం రఘనాథ్ రిసార్ట్స్‌లో వున్న స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పులివర్తి నాని మాట్లాడారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి ఓ అపరిచితుడని, చేప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఉండదన్నారు. తనపై హత్యాయత్నం చేయించడానికి ప్రయత్నించి, ఇప్పుడే హితబోధన చేస్తున్నాడని ఆరోపించారు. రెండురోజుల క్రితం మీడియా సమావేశంలో పోలీసులు, జడ్జీలు అవసరం లేనివిధంగా అనుచిత వాక్యలు చేసార న్నారు. రామచంద్రాపురం జడ్పిటిసి భర్త, భానుకుమార్‌రెడ్డి తనపై హత్యాయత్నాన్ని చేయించిన విషయాన్ని కూడా మరవడానికే చెవిరెడ్డి కల్లబొల్లి మాటలు చెప్తున్నాడని తెలిపారు. నామినేషన్‌రోజున తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద టిడిపి జెండానే వైసిపి నాయకులు కిందవేసి తొక్కడంతోనే ఘర్షణ మొదలైందని తెలిపారు. అక్కడే వున్న కోడలపై దాడి చేయడానికి యత్నించారన్నారు. నాపై దాడి జరగలేదని, కావాలనే స్విమ్స్‌కు వెళ్ళి చికిత్స తీసుకున్నట్లుగా ఆరోపిస్తున్నావు! చెవిరెడ్డి ఏ ఆసుపత్రికి రమ్మాన్నా వస్తానని, ఎక్స్‌రేలు, గాయాలే నిజాలన్నారు. చంద్రగిరిలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటానికే ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం జరిగిందని నాని మీడియాకు వివరించారు. నా ఆర్థిక మూలాలపై ఎమ్మెల్యే చెవిరెడ్డి దెబ్బకొట్టారని నాని ఆరోపించారు. తనకున్న ఒక క్వారీ మాత్రమే ఉందని, క్వారీ ఎక్స్‌టేన్స్‌లో రూ.50కోట్లు పెనాల్టీ వేయించిన ఘనత కూడా చెవిరెడ్డిదే అన్నారు. టిడిపికి పని చేసారనే నేపంతో సీనియర్ నేత యంఆర్‌సి రెడ్డిని సస్పెండ్ చేయించిన నీచ చరిత్ర చెవిరెడ్డిదే అన్నారు. చెవిరెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ఏ ఒక వైకాపా నాయకుణ్ని ఎదగనీయలేదని, కుమారుడు, కుటుంబ ఎదుగుదల మాత్రమే చూసుకున్నాడని విమర్శించారు. చెవిరెడ్డి కుమారుడు గెలిస్తే ప్రజలతో ఉంటాడు... ఓడిపోతే వ్యాపారాలు చేసుకుంటాడని చెప్తున్నావు...ఇదేనా నీతి, గెలిచిన, ఓడిన ప్రజలతో మమేకం అవ్వాలి గానీ, ఓడిపోతే వ్యాపారాలు చేసుకుంటాడని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. తాను మాత్రం గెలిచిన..ఓడినా తుది శ్వాస వరకు ప్రజలతోనే ఉంటానని పులివర్తి నాని స్పష్టం చేసారు.

# సత్వరం నీటి ట్యాంకుల క్లోరిరేషన్ : కలెక్టర్ సగిలి



టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు, మే 27 ప్రభాతవార్త: అకాల వర్షాలు, రుతు పవనాల ప్రభావంతో జూన్ నుండి డిసెంబర్ వరకు వర్షాలు కురిసే అవకాశం వుండటంతో కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు రాకుండా వివిధ శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ అధ్యక్షతన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఈ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లైతే దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజలు ఆరోగ్యంగా వుంటారన్నారు. క్షేత్ర స్థాయిలో దోలమ కట్టడిపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పాఠశాలల్లోని నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే దోమలు ఉత్పత్తి కాకుండా క్రిమి సంహారక మందులు స్ప్రే చేసి జూన్ 3వ తేదీ పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలో నీటి సరఫరాకు సంబంధించి మొత్తం 6,400 స్కీములు వున్నాయని, వీటితో పాటు నగరపాలక సంస్థల పరిధిలో వున్న నీటి సరఫరా వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పాఠశాలలు, హాస్టళ్ళలోని ట్యాంకులను క్లీన్ చేసి పరిశుభ్ర నీరు వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో అంటువ్యాధుల కట్టడిపై తీసుకోవాల్సిన చర్యలపై మహిళా సంఘాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను మరింత పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ రవిరాజు, డాక్టర్ అనిల్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, మెప్మా పిడి రాధామ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ విజయకుమార్, ఆర్‌ఐఓ షేక్‌మౌలా, డిఇఓ దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పథకంలో ఇష్టం ఉంటే పనిచేయండి

-లేదంటే రాజీనామా చేసేయండి..డ్వామా పిడి



సమావేశంలో ఎపిఓతో మాట్లాడుతున్న డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్

తొట్టంబేడు, మే 27 ప్రభాతవార్త : వలసలను నివారించడానికి ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో ఇష్టం ఉంటే పనిచేయడని లేదంటే రాజీనామా చేసి వెళ్ళిపోండని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వెంకటగిరి, తొట్టంబేడు మండలాలకు సంబందించిన ఎపిఓ, ఇసి, ఫీల్డ్ అసిస్టెంట్, టెన్నికల్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వలసలను నివారించడానికి మహోన్నతమైన పథకం ప్రవేశపెట్టిందని అయితే దీనిలో కూడా పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఇంటికి వెళ్ళిపోండని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన టార్గెట్‌లను పూర్తిచేయకపోతే తప్పుకోవాలని తెలిపారు. పంచాయతీల్లో పనులను గుర్తించడంలో కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు విఫలమయ్యారని పేర్కొన్నారు. తొట్టంబేడు మండల రోజువారీ టార్గెట్ 3565మంది ఉండగా కేవలం 2362మంది పనిచేస్తున్నారని ఇలా అయితే కుదరదని స్పష్టం చేశారు. పనులు చేయాల్సిన సమయంలో కార్యాలయాల్లో ఫ్యాన్లకింద కూర్చుని పోన్లలో మాట్లాడుకోడం మంచిపద్ధతి కాదన్నారు. ఉద్యోగం ఇష్టం లేకపోతే స్వచ్ఛందంగా వెళ్ళిపోవచ్చని ఎంతో మంది కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్ట్ అసిస్టెంట్, టెక్నికల్ అసిసెంట్లదే అని తెలిపారు. వారం రోజుల్లో మార్పురాకపోతే అందరినీ సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అన్ని మండలాల కంటే తొట్టంబేడు మండలంలోనే తక్కువమంది కూలీలు పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. మార్పురాకపోతే సహించేది లేదన్నారు. అసలు ఎపిఓ ఏం చేస్తున్నారంటూ నిలదీశారు. పనులను గుర్తించడంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో ఎపిఓ సుజాత, ఇసి, ఫీల్డ్ అసిస్టెంట్, టెన్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# టోర్నమెంట్ విజేత పుత్తూరు ఫుట్‌బాల్ జట్టుకు అభినందన



పుత్తూరు, మే 27 ప్రభాతవార్త : ఇటీవల రేణిగుంట ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన పుత్తూరు ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ క్లబ్ జట్టు సభ్యులను సోమవారం తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, పుత్తూరు మునిసిపాలిటీ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి) అభినందించారు. ఫుట్‌బాల్ క్రీడలో నూతన ఒరవడిలో భాగంగా ఒక జట్టుకు ఏడు మంది క్రీడాకారులతో ఈ నెల 25, 26 తేదీల్లో రేణిగుంటలో ఫుట్‌బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ జరిగింది. ఇందులో పుత్తూరు, అరక్కోణం, అనంతపురం, శ్రీకాళహస్తి, కడప, తిరుపతి, రేణిగుంట, పలమనేరు, హిందుపురం, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి మొత్తం 18 జట్లు పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో పుత్తూరు జట్టు విన్నర్స్‌గా నిలిచి రూ. 15,000 వేలు నగదు బహుమతి గెలుచుకుంది. రేణిగుంట జట్టు రన్నర్స్ దక్కించుకుని రూ. 10,000 వేలు పొందింది. విన్నర్స్‌గా నిలిచిన పుత్తూరు ఫుట్‌బాల్ జట్టు కోచ్ నవీన్‌కుమార్‌తో పాటు జట్టు సభ్యులు బాలాజీ ( కెప్టెన్ ), ఇ.దినేష్, సి.జగదీష్, ఎ.దిలీప్, కె.శ్రీనివాసులు, ఇసాక్, రవూఫ్, గణేష్, ఉదయ్, చరణ్‌లను జయప్రకాశ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటికి మూడు టోర్నమెంట్‌లలో విజయం సాధించిన పుత్తూరు ఫుట్‌బాల్ జట్టు భవిష్యత్‌లో మరిన్ని టోర్నమెంట్‌లు గెలవాలని ఆకాంక్షించారు.

# కన్నుల పండువగా స్నపన తిరుమంజనం



చంద్రగిరి, మే 27 ప్రభాతవార్త: శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ కన్నుల పండువగా జరిపించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం నుండి వార్షిక వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. తదుపరి స్వామివారిని వసంత మంపడపానికి వేంచేపుచేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందనం, తేనె, కొబ్బరినీళ్ళతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుండి ఆలయ ఆవరణలో స్వామివారు తనదేవేరులతో ఊంజల్‌పై సేదదీరారు. 6 గంటల నుండి 7 గంటల వరకు తిరుచ్చి వాహనంపై అధిష్టించి తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్స్ మునిచెంగ్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి, బాలాజీ రంగాచార్యులు, నారాయాణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతతకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవు : సిఐ చిన్న గోవిందు



గంగవరం, మే 27, ప్రభాతవార్త : జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రశాంతతకు విఘాతం కల్పిస్తే చట్టపమైన కఠిన చర్యలు తప్పవని గంగవరం అర్బన్ సిఐ చిన్న గోవిందు హెచ్చరించారు. సోమవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు డిఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో గంగవరం అర్బన్, రూరల్ సిఐలు చిన్నగోవిందు, క్రిష్ణమోహన్ ఆధ్వర్యంలో పలమనేరు, పంజాణి, బైరెడ్డిపల్లె ఎస్‌ఐలు,స్థానిక పోలీసులు,సాయుధ బలగాల ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామమైన జీడిమాకులపల్లెలో పోలీసు కవాతును నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ చిన్న గోవిందు మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా,ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ముందు జాగ్రత్తలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కును స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణం సమకూర్చడమే పోలీసుల సంకల్పమని ఆయన తెలిపారు.ఎన్నికల గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని కావున ఇద్దరు కంటే ఎక్కువ మంది గుమికూడదని,ఏ పార్టీ గెలిచినా కూడా రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు,బాణసంచా పేల్చడం వంటి కార్యక్రమాలను నిషేదించడం జరిగిందని ఆయన హెచ్చరించారు.

# జైన్ ఫార్మ్‌ఫ్రెష్ కర్మాగారాన్ని సందర్శించిన యేనియన్ బృందం



గంగాధర నెల్లూరు మే 27 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని జైన్ ఫామ్ ఫ్రెష్ కర్మాగారాన్ని అంతర్జాతీయ పండ్ల యూనియన్ బృందం ( ఐ ఎఫ్ యు) సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జైన్ కర్మాగారం మేనేజర్ షమీర్ శర్మ భారతీయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు తో వీరికి స్వాగతం పలికారు అనంతరం గుజ్జు తయారీ యంత్రాలను తయారీ విధానాన్ని వివరించారు అనంతరం మామిడి రైతులతోనేరుగా కలసి పంట దిగుబడి గురించి వివరాలను అడిగి తెలుపుకున్నారు. ఈ బృందం బెంగళూరులో జరిగే వేర్వేరు రెండు సమావేశాలలో పాల్గొనడానికి రాగా భారత దేశంలోనే అధికంగా మామిడి సాగులో ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లాలోని తమ కర్మాగారాన్ని సందర్శించవలసినదిగా జైన్ యాజమాన్యం కోరారు దీంతో అంతర్జాతీయ ఫ్రూట్స్ యూనియన్ అద్యక్షుడు కీస్ కుల్స్ సందర్శనకు సుముఖత వ్యక్తం చేవారు. ఈ బృందం ప్రపంచం నలుమూలల పర్యటించి మార్కెట్ విస్తరింప చేసే విధంగా పనిచేస్తుందని దీని ద్వారా పండ్లను తయారు చేసే రైతులకు గిట్టుబాటు ధరలను అందించడానికి దోహదపడుతుందన్నారు. రైతులు కూడా మార్కెట్ కు న్యాయమైన పండ్లను అందించడానికి ప్రయత్నించాలన్నారు. జైన్ ఫామ్ ఫ్రెష్ యాజమాన్యం వీరికి విందుగా తెలుగువారి ఆంధ్ర రుచులను అందించారువీరితోపాటు సీఈవో సువాన్ శర్మ, క్యూఏ హెడ్ సునీల్ గుప్తా, జైన్ కంపెనీ ఇండియా ఆపరేషన్ హెడ్ రోహన్‌షా లు పాల్గొన్నారు.

# నీటి కుంటలో పడి వ్యక్తి మృతి!

-పండుగ వేళ గ్రామంలో విషాద వాతావరణం

పెద్దపంజాణి,మే 27,ప్రభాతవార్త: నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది.గ్రామంలో జరిగే గంగ పండుగ చూడడానికి వచ్చి ఓ వ్యక్తి తిరిగిరాని లోకానికి చేరుకున్న సంఘటన బసవరాజుకండ్రిగలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం మేరకు... పుంగనూరు పట్టణంలోని మంగళం కాలనీకి చెందిన సి.కె.మురుగేష్(50) పుంగనూరు టమోటా మార్కెట్‌లో దుకాణం నిర్వహిస్తున్నారు.మురుగేష్‌కు ఇద్దరు భార్యలు నలుగురు పిల్లలు కలరు. సోమవారం మండలంలోని బసవరాజుకండ్రిలో గంగమ్మ జాతర కావడంతో బందువుల ఇంటికి వచ్చిన మురుగేష్ ఉదయం గంగమ్మ జలధి ఉత్సవం అనంతరం గ్రామ సమీపంలోని బంధువుల వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన నీటి కుంటలో ఈతకు వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో బందువులు నీటి కుంటలో గాలింపు చేపట్టారు.ఎంతకు మురుగేష్ ఆచూకి లభ్యం కాకపోవడంతో పలమనేరు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది రెడ్డప్ప,అరుణ్ నీటి కుంట నుండి మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మాజీ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



రేణిగుంట, మే 27 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి విమానంలో రేణిగుంట చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతి వెళ్లారు.

# వేషాల సందడి జంబలకడిపంబ



సత్యవేడు, మే 27 ప్రభాతవార్త: సత్యవేడులో గంగమ్మజాతర వేడుకలు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. బుధ, గురువారాల్లో ఇక్కడ గంగజాతర నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా సోమవారం కొంత మంది భక్తులు వేషాలు ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆరుగురు పురుషులు ఆడవారి వేషాలతో నెనత్తిన కలిశాలు ధరించి పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. ప్రతి సంవత్సరం ఇక్కడ జాతర వైభవంగా జరుగుతుందని జిల్లా పూర్తిగా తెలుసు. అంతేగాక సత్యవేడు జాతర అంటే సీఐలు, ఎస్‌ఐలు, టాస్క్‌ఫోర్సు సిబ్బంది ప్రతి ఒక్కరు ఇక్కడ జాతరను వీక్షించడానికి పరుగులు తీస్తారు. మే మొదటి వారంలో జరగాల్సిన జాతర ఎన్నికలు రావడంతో మే చివరి వచ్చింది. కాలేజీలు, పాఠశాలలు సెలవులుగా ఉండడంతో పిల్లలు, పెద్దలు ఈ జాతరను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని సత్యవేడు వాసులు కోరుకుంటున్నారు.

# గ్రామాల్లో జాతర సంబరాలు...గంగమ్మకు మొక్కులు



శ్రీకాళహస్తిరూరల్, మే 27 ప్రభాతవార్త : గ్రామాల్లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. పంటలు బాగా పండిన తరువాత వేసవి కాలంలో గ్రామాల్లో జాతరలను నిర్వహించటం గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో తిరుపతి గంగమ్మ జాతర తరువాత శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో జాతరలు నిర్వహించటం జరుగుతుంది. తిరుపతి గంగమ్మ జాతరతోపాటు శ్రీకాళహస్తి పట్టణంలోని బిపి అగ్రహారంలో జాతరను నిర్వహించారు. వచ్చేనెల 23న పానగల్ జాతరను భారీ ఎత్తున నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 28,29న శ్రీకాళహస్తి ఏర్పేడు,తొట్టంబేడు మండలంలోని గ్రామాల్లో జాతరను నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తి మండంలోని కె.వెంకటాపురంలో భారీ ఎత్తున జాతరను నిర్వహిస్తారు.ఇప్పటికే గ్రామంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఊరంతా విద్యుత్ దీపాల కాంతులను నింపుతున్నారు. కాగా అలంకారాలకు బయట నుంచి కళాకారులను రప్పిస్తున్నారు. ఇక ఇంటింటికి మేకపోతులు,పొట్టేళ్ళు, కోళ్ళను గంగమ్మ తల్లికి బలి ఇవ్వటం పట్టణానికి చెందిన స్నేహితులను, సమీప గ్రామాల్లోని తమ బంధువులకు ఆహ్వానాలు పంపుతున్నారు. రెండు రోజుల పాటు గ్రామంలో బారీ ఎత్తున సంబరాలు జరుపుకోనున్నారు. కాగా ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం, సరస్వతి కండ్రిగ, తుమ్ముల చెరువు, తొట్టంబేడు మండలంలోని కల్లిపూడి గ్రామంలో జాతరలను మంగళవారం,బుధవారం జాతరను నిర్వహించనున్నారు.అయితే ఇటీవలే ఎన్నికలు జరిగాయి. కాబట్టి గ్రామాల్లో ఘర్షణలకు అవకాశం లేకుండా ముందుజాగ్రత్తగా పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

# దళారుల అడ్డాగా... శ్రీకాళహస్తీశ్వరాలయం

-కొరవడి అధికారులు పర్యవేక్షణ



శ్రీకాళహస్తి, మే 27 ప్రభాతవార్త : దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి.సోమవారం ఆలయం భక్తులతో కిట కిట లాడింది. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తి నిలయంగా విరాలజిల్లుతుంది.గత నాలుగు సంవత్సరాలుగా ఆలయంలో పరిపాలన గాడి తప్పింది.ఎటు చూసిన దళారుల అడ్డాగా మారింది. అధికారులేమో మౌన ముద్రలో ఉన్నారు. పరిపాలన ఎలా పోతే మాకేంటి? మా ఉద్యోగాలు మాకు సేఫ్. అన్నట్లు వ్యవహారిస్తున్నారు. ఇక అధికారుల మాట దేవుడెరుగు ఇక్కడ గేట్ల వద్ద పని చేస్తున్న సిబ్బంది ఆభద్రతాభావానికి గురౌతున్నారు. వారికి రక్షణే కరువు కావటంతో దళారులు రాజమార్గంలో నడుస్తున్నా పట్టించుకోవటం లేదు.

**విదేశాల నుంచి భక్తులు:**

రాహుకేతుదోష నివారణ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు.ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది.దేవస్థానం అందించిన సమాచారం మేరకు సోమవారం 25వేల మంది దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇక వరుస సేలవులతో రద్దీ పెరుగుతుందని ఏర్పాట్లు చేస్తున్నట్లు,ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు.సోమవారం ఉదయం నుంచి భక్తులు రద్దీగా కనబడ్డారు. ముఖ్యంగా ఆలయంలో నిర్వహించే అభిషేకాలకు రద్దీ చోటు చేసుకుంది.ప్రత్యేకదర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 4063 మంది కాగా రాహుకేతుదోష నివారణ పూజలు ఐదువేల మంది జరిపించుకున్నారు. అభిషేకాలకు రద్దీ ఏర్పడింది. రికార్డు స్థాయిలో 175 మంది అభిషేకాలు జరిపించుకోగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 68 జరిగాయి.అర్చనలు 68, గోపూజలకు 50 మంది దీపారాధన 11 హోమాలు 6 జరిగినట్లు అధికారులు వివరించారు.

**రాహుకేతు పూజలకు నిరీక్షణ:**

సోమవారం ఉదయం నుంచి ఎండలను సైతం లెక్క చేయక రాహుకాల సమయంలో పూజలు చేయించుకొవటానికి వచ్చిన భక్తులు ఎండలను లెక్క చేయలేదు. పూజలకు హాజరయ్యారు. ఆది, సోమవారాల్లో రోజూ 40వేల మంది భక్తులు తగ్గటం లేదు.ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఛైర్మెన్ శ్రీనివాసులు ఇఓ సాగర్‌బాబు వివరించారు. మిగిలిన రోజుల్లో కనీసం 20వేలు తగ్గటం లేదు. దాంతో ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.

**తండోపతండాలుగా భక్తులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన లభిస్తుంది. దేశ విదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. అయితే ఇక్కడకు వచ్చిన భక్తుల సమస్యలు వచ్చిన తరువాత కానీ అర్థం కావటం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే సామన్య భక్తులు బస కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతంగా మారింది.ఇక్కడ రద్దీ రోజుల్లో గదులు వేలరూపాయలు పలుకుతుంటే వచ్చిన సామన్య భక్తులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితి చోటు చేసుకుంటుంది. దేవస్థానంకు సంబంధించిన గదులు పరిమితంగా ఉన్నాయి. కొత్తగా లోబావిలో కైలాస సదన్‌లో 125 గదులున్నా తగిన సమాచారం లేదు.వాటికి సంబంధించి కూడా సమాచారం లేదు. దాంతో ఆటోల డ్రైవర్ల ఇష్టారాజ్యంగా మారింది.